క్లుప్తంగా

రైతుబజార్‌లో అక్రమంగా పార్కింగ్ వసూళ్లు

గోల్కొండ: మెహిదీపట్నం రైతుబజార్‌లో వాహనాల పార్కింగ్ దందా అక్రమంగా కొనసాగుతుందని బీజేపీ గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా నాయకులు రావుల మాణిక్ ప్రభు, గోదాలక్ష్మీకాంత్ యాదవ్ అన్నారు. రైతుబజార్‌లో పార్కింగ్ చేసిన వాహనాలకు డబ్బులు వసూలు చేయరాదని స్పష్టంగా ఉన్నా కూడా ఇక్కడ వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంపై తాను రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్‌తో పాటు సంబంధిత మార్కెటింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని వారు తెలిపారు.

సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా రమేశ్ కుమార్



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పాలెపల్లి రమేశ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ భవానీనగర్ పోలీస్‌స్టేషన్ డీఐ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. ఆయన స్థానంలో సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న రమేశ్‌కుమార్‌ను సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన గురువారం శేఖర్‌రెడ్డి నుంచి బాధ్యతలను స్వీకరించారు.

త్వరలో రోడ్డు పనులు ప్రారంభం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో త్వరలో రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయని తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రోహిణి అన్నారు. గురువారం ఆమె గోల్కొండ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి మెడికల్ సూరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లాతో కలిసి ఆస్పత్రిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి ప్రాంగణంలో జరగనున్న రోడ్డు పనులపై చర్చించారు. అయితే గోల్కొండలో రోడ్ల విస్తరణ పథకంలో భాగంగా జీహెచ్‌ఎంసీ వారు ఆస్పత్రికి నోటీసులు ఇచ్చారని ఈ సందర్భంగా డాక్టర్ మజహర్ ఉల్లా ఆమె దృష్టికి తెచ్చారు. ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు ఆస్పత్రిలో త్వరలోనే కొత్త బ్లాక్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, దీనికిగాను రూ.4 కోట్లు మంజూరు అయ్యాయని ఉల్లా వివరించారు. ఆమె వెంట ఏఈ శర్మ తదితరులున్నారు.

'మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరు'

సాక్షి, సిటీబ్యూరో: గతంలోలా కాకుండా ప్రస్తుతం మహిళలు తాము కోరుకున్న రంగాన్ని ఎంచుకోగలుగుతున్నారని, కాక్ టైల్ మిక్సింగ్ కల్చర్‌లో కూడా భాగం అవుతున్నారని ప్రముఖ పానీయాల మిక్సాలజిస్ట్, బ్రేడ్ అంబాసిడర్ ఇష్రాత్ కౌర్ అన్నారు. నగరంలోని తాజ్ ఫలుక్‌నుమా ప్యాలెస్‌లో నిర్వహించిన బకార్డీ లెగసీ లాంచ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని నగరానికి చెందిన పలువురు మహిళా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఉద్దేశించి మాట్లాడారు. తానీ రంగంలో అడుగుపెట్టిన 2010 సంవత్సరం వరకూ ఈవెంట్స్, కాక్‌టైల్ పార్టీస్.. తదితర కార్యక్రమాల్లో ఉద్యోగులుగా సేవలు అందించేందుకు మహిళలు పెద్దగా సాహసించేవారు కాదన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని, ఏ రంగంలోకైనా వారు దూసుకుపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బకార్డీ మార్కెటింగ్ డైరెక్టర్ జీనా వికాసిమ్ తదితరులు పాల్గొన్నారు.

5న 'సీఓఈ' అర్హత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) ఇంటర్మీడియట్ అర్హత పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గౌలిదొడ్డి గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ శారద గురువారం తెలిపారు. ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సీఓఈ–2023 పరీక్ష జరుగుతుందని అభ్యర్థులు సకాలంలో హాజరవాలన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే రావాలని ఆమె సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్, బ్లూ లేదా బ్లాక్ పెన్ను, పరీక్ష ప్యాడ్ తీసుకురావచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం

రాయదుర్గం: ఆసియాలో టాప్–20 ఆర్ట్స్ అండ్ హ్యూమనిటీస్ పరిశోధకుల్లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఇంగ్లిష్ ఫ్యాకల్టీ ప్రతినిధులకు అవకాశం దక్కింది. వరుసగా నాలుగో సంవత్సరం విడుదల చేసిన సెంటర్ ఫర్ పబ్లికేషన్స్ ఎథిక్స్, సావిత్రిబాయి పూలే పూణే విశ్వవిద్యాలయ నివేదిక 'భారతదేశం, దక్షిణాసియా, తూర్పు ఆసియాలో కళలు, హ్యూమనిటీస్ పరిశోధనలో ఇద్దరు హెచ్‌సీయూ ప్రొఫెసర్లు నారాయణచంద్రన్, ప్రమోద్.కె.నాయర్‌లకు అవకాశం లభించింది. ప్రొఫెసర్లకు గుర్తింపు రావడం ఆనందకరమని హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు అన్నారు.

గ్యాస్ బండపై భగ్గు!

ధరల పెంపుపై ధర్నాలు, రాస్తారోకోలు



ఉప్పుగూడ జెండా వద్ద నిరసన తెలుపుతున్న శ్రీనివాస్ తదితరులు



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్, లక్ష్మణ్ రావు

చాంద్రాయణగుట్ట: గ్యాస్ ధరలను ఇష్టానుసారంగా పెంచిన నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేరోజులు దగ్గర పడ్డాయని ఉప్పుగూడ డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ అన్నారు. గ్యాస్ ధరల పెంపుకు వ్యతిరేకంగా ఉప్పుగూడ జెండా వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2014 నుంచి బీజేపీ సర్కార్ ఇష్టానుసారంగా గ్యాస్ ధరలను పెంచుతూ పేదలపై భారం మోపుతుందన్నారు. బ్రహ్మచారి, దిలీప్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పురానాపూల్ చౌరస్తాలో..

దూద్‌బౌలి: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌లపై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పుస్తె శ్రీకాంత్ అన్నారు. గురువారం పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు పురానాపూల్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఖాళీ సిలిండర్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూ.400లు ఉన్న సిలిండర్‌ను రూ.1200లకు పెంచిందని ఆరోపించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను తగ్గించాలని.. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పెండ్యాల లక్ష్మణ్ రావు, గోపీయాదవ్, అనూషగోపీగౌడ్, మంజుల, కిట్టు గౌడ్, మహేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదోళ్ల నడ్డి విరుస్తున్న బీజేపీ ప్రభుత్వం..

అబిడ్స్: తరచూ గ్యాస్ ధరలు అడ్డగోలుగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం పెంచుతూ.. పేద ప్రజల నడ్డి విరుస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ల ధరలు మరోసారి కేంద్రప్రభుత్వం పెంచడం దారుణమన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేద ప్రజలకు శాపంగా మారిందన్నారు. తెలంగాణ తరహాలోనే దేశ నలుమూలలా బీఆర్‌ఎస్ పార్టీ రాబోయే ఎన్నికల్లో విజయ దుందుభి మోగిస్తుందన్నారు.

'పట్టుదలతో చదివితే ఏదైనా సాధ్యమే'



అఫ్జల్‌గంజ్: పట్టుదల, అంకిత భావంతో చదివితే జీవితంలో ఏదైనా సాధించవచ్చని అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం ముఖ్య గ్రంథపాలకులు ఏవీఎన్ రాజు అన్నారు. గురువారం చిక్కడపల్లికి చెందిన సన్‌షైన్ ఇండియా అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్–2 పోటీ పరీక్షలకు హాజరైయ్యే అభ్యర్థులకు 20 పేజీలతో రూపొందించిన నోట్స్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సమన్వయకర్త సురేష్ నాయుడు మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు హాజరైయ్యే పేద విద్యార్థులకు అందించే కోచింగ్‌లో 50 శాతం రాయితీని కల్పిస్తూ తమ వంతు సహాయం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ గ్రంథపాలకులు పీవీజీ రాణి, సిబ్బంది అజీజ్ అహ్మద్, శ్రీకాంత్, రజాక్, ఉమామహేశ్వర్ రెడ్డి, ప్రతాప్, రమ్య, విక్రమ్, భాస్కర్‌లతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం



రోగుల సహాయకులకు అన్నదానం చేస్తున్న డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. దాదాపు 500 మంది రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ... హోంమంత్రి మహమూద్ అలీ సుఖఃసంతోషాలతో జీవించాలని పలు ఆలయాలు, మసీదులు, చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, రాజ్‌కుమార్, కె.శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, అరుణజ్యోతి, చంద్రశేఖర్, శివకుమార్, రామకృష్ణారెడ్డి, శ్రీధర్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

అబిడ్స్: అన్నివర్గాల ప్రజలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ అర్షద్ అలీఖాన్ హోంమంత్రి మహమూద్ అలీని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీకి రాష్ట్ర తరహాలోనే దేశ నలుమూలలా ఆదరణ లభిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ తోనే అభివృద్ధి, ప్రగతి కొనసాగుతుందన్నారు.



హోంమంత్రిని కలిసిన అర్షద్ అలీఖాన్ తదితరులు



విద్యుత్ ఉద్యోగుల నిరసన

గోల్కొండ: గత సంవత్సరం ఏప్రిల్ నుంచి తమకు అందాల్సిన నూతన వేతనాలను చెల్లించకపోవడం అన్యాయమని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ఉద్యోగుల 1104 ఉపాధ్యక్షుడు ఎం. భాస్కర్ రెడ్డి, రీజనల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ గౌడ్ అన్నారు. నూతన వేతనాల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ టీఎస్‌సీఈ–జాక్ ఆధ్వర్యంలో గురువారం మెహిదీపట్నంలోని విద్యుత్ కార్యాలయం వద్ద ఉద్యోగులు లంచ్ అవర్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన వేతనాల అమలులో యాజమాన్యం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత విస్తృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ సీహెచ్ జ్యోతి

అబిడ్స్: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటిస్తే ఎలాంటి సమస్యలు దరిచేరవని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఎస్సై సీహెచ్. జ్యోతి పేర్కొన్నారు. జూబ్లీ కాన్వెంట్ హైస్కూల్‌లో విద్యార్థులకు, సిబ్బందికి ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు ఆదేశాల అనుసారం ఎస్సై జ్యోతి అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్, స్టాప్‌లైన్, రాంగ్‌రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, జీబ్రా క్రాసింగ్‌పై ఆమె అవగాహన చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధన పాటిస్తే ట్రాఫిక్ వాహనదారులతో పాటు ఇతరులకు సైతం సమస్యలు తలెత్తవన్నారు. నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న వయస్సు నుంచే క్రమ శిక్షణ, ఏకాగ్రత, సమయం వృథా కాకుండా విద్యార్థులు మంచి నడవడికతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో చక్రధర్, ప్రిన్సిపాల్ రాషిద్, సబినా, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

తృణ ధాన్యాల ఆవశ్యకతపై నేడు ర్యాలీ

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నేడు తృణ ధాన్యాల ప్రాముఖ్యత మరియు సేద్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు తెలిపారు.2023ను అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా గుర్తించడం జరిగిందని, తృణధాన్యాల సాగును ప్రోత్సహించడంతో బాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులను సాగుకు సన్నద్ధం చేసేందుకు ఈ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ ర్యాలీ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరవుతారని వీరితో పాటు భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు.

క్రైం కార్నర్..

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

డబీర్‌పురా: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చంచల్‌గూడ ఆల్ ఆమన్ హోటల్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సల్మాన్ (23) కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఇందులో భాగంగా గత నెల 26న సాయంత్రం 4.30 గంటలకు మహ్మద్ సల్మాన్ ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో వృద్ధుడు..

వృద్ధుడు కనిపించకుండా పోయిన ఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఉస్మాన్ (67) గత నెల 20న ఉదయం 11.30 గంటలకు బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీ సిమెంట్ సంచుల గోదాం దగ్ధం

జియాగూడ: ప్రమదవశాత్తు ఖాళీ సిమెంట్ సంచుల గోదాంలో మంటలు వ్యాపించి ఆస్తి నష్టం జరిగిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారు ఝామున వెలుగు చూసింది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసరి హనుమాన్ పటేల్ హోటల్ ప్రాంతంలో దూళ్‌పేట్‌కు చెందిన ముఖేష్ సింగ్ (39) కొన్ని సంవత్సరాల నుంచి ఖాళీ సిమెంట్, ప్లాస్టిక్ సంచుల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఉదయం 5 గంటల ప్రాంతంలో మూసి ఉన్న గోదాంలో నుంచి మంటలు వ్యాపించడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లంగర్‌హౌస్, బహదూర్‌పురా ఫైర్ స్టేషన్ల నుంచి రెండు ఫైర్ ఇంజన్లను రప్పించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గంజాయి మత్తులో.. బాలుడిని చితకబాదారు

రాజేంద్రనగర్: గంజాయి మత్తులో కొందరు మైనర్లు డబ్బు కోసం మరో మైనర్ బాలుడిని చిత్రహింసలకు గురి చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దానమ్మ జోపిడి ప్రాంతంలో ఓ వ్యక్తి కిరాణాషాపు నిర్వహిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. మైనర్ అయిన పెద్ద కుమారుడు పాఠశాలకు వెళ్లి వచ్చిన అనంతరం దుకాణంలో కూర్చుంటాడు. ఇదే ప్రాంతానికి చెందిన ఐదుమంది మైనర్ బాలురు గంజాయికి అలవాటుపడి తిరుగుతున్నారు. బుధవారం మధ్యాహ్నం దుకాణంలో ఉన్న మైనర్ బాలుడిని బయటకు రమ్మని పిలిచి పక్కనే ఉన్న గుట్టల్లోకి తీసుకువెళ్లి తాము అడిగినప్పుడల్లా డబ్బులు ఇవ్వాలంటూ చితకబాదారు. బట్టలు ఊడదీసి అరగంట పాటు వేధించారు. దీంతో బాలుడికి గాయాలయ్యాయి.వారి నుంచి తప్పించుకుని ఇంటికి వచ్చి విషయాన్ని తల్లికి తెలిపాడు. తల్లిదండ్రులు గురువారం ఉదయం మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనకు పాల్పడిన వారంతా మైనర్లు అని పోలీసులు వెల్లడించారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరిపించాలి



ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

నాంపల్లి: ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట ఆందోళన జరిగింది. ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం గేట్లు ఎక్కి లోనికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేసిన ఏబీవీపీ కార్యకర్తలను బేగం బజార్ పోలీసులు అరెస్టు చేసి ఆందోళనకారులను అక్కడి నుంచి తరలించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కమల్ సురేష్ ప్రసంగించారు. ఇంటర్ బోర్డుకు శాశ్వత కమిషనర్‌ను నియమించాలని, అనుమతులు లేని కళాశాలలను రద్దు చేయాలని కోరారు. శ్రీ చైతన్య కార్పొరేట్ జూనియర్ కళాశాలలో వరుస ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర నాయకులు పృథ్వీతేజ, జీవన్, రాజు, మహస్తష్, శ్యామ్, జిల్లా కన్వీనర్లు శ్రావణ్, ప్రతిక్, సిరివెన్నెల కల్యాణి, దీపిక, నదీమ్, చందు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు ఎదుట ఆమ్ ఆద్మీ నేతల ఆందోళన ..

శ్రీ చైతన్య కళాశాల నార్సింగ్ శాఖలో ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థి సాత్విక్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, శోభన్ బాబు భూక్యా హాజరై ప్రసంగించారు. కార్పొరేట్ కాలేజీల ఆగడాలకు అమాయకపు విద్యార్థులు బలవుతున్నారని ఆరోపించారు. అనంతరం ఆప్ నేతలు ఇంటర్ బోర్డు కార్యాలయం గేటు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించడంతో బేగం బజార్ పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం వారిని అరెస్టు చేసి అక్కడ నుంచి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు బర్క కృష్ణయాదవ్, మొహమ్మద్ మాజిద్, పప్పుల సుధాకర్, పరీక్ష రావణ, సయ్యద్ గఫార్ పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారణకు చర్యలు



మేయర్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న మమతా గుప్తా

అబిడ్స్: కుక్కల బెడద నివారణకు ప్రత్యేక కృషి చేస్తామని గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. గన్‌ఫౌండ్రీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా కుక్కల బెడదను నివారించాలని మేయర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గన్‌ఫౌండ్రీతో పాటు అన్ని ప్రాంతాల్లో కుక్కల బెడద నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ నాయకులు దేవర వంశీ అన్నారు. గురువారం ఆయన బోజగుట్ట, శ్రీరాంనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన తండ్రి దివంగత దేవర కరుణాకర్ బాటలో నడుస్తూ ప్రజా సేవలోనే ఉంటానని ఆయన పేర్కొన్నారు.



బస్తీవాసులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు దేవర వంశీ

'వాఙ్మయి సంచిక' కు రచనలు పంపండి

నాంపల్లి: బోధన, పరిశోధన, ప్రచురణ, అధ్యయనాలతో పాటు తెలుగు సాహితీ సాంస్కృతిక సంపదను తరతరాలకు అందించేందుకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అధికారికంగా వాఙ్మయి పేరిట సాహిత్య వైజ్ఞానిక సంచికను వెలువరిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంచికలో ముద్రించడానికి తమ వ్యాసాలలో తెలుగు భాషా సంస్కృతి, చరిత్ర, పురావస్తు, జోతిష్య, లలిత కళల శాస్త్రాల ఆధారంగా నూతన అంశాలను జోడిస్తూ ఆధారితమైన సమగ్ర విశ్లేషణతో పరిశోధనాత్మక రచనలను పంపాలని తెలుగు రాష్ట్రాలకు చెందిన పండిత, పరిశోధకులను కోరారు. విశ్వవిద్యాలయం నియమించిన సంపాదక వర్గం రచయితల రచనలను పరిశీలించి ఉత్తమమైన వాటిని వాఙ్మయి సంచికలో ముద్రించడం జరుగుతుందని తెలిపారు. రచయితలు, పరిశోధకులు తమ రచనలను రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్ అనే చిరునామకు పంపవచ్చని లేదా స్వయంగా వచ్చి అందజేయవచ్చని సూచించారు.

ఆకట్టుకున్న ఇంగ్లిష్ ఫెయిర్



ఇంగ్లిష్ ఫెయిర్‌ను తిలకిస్తున్న డాక్టర్ ఇర్ఫాన్ ఖాన్, ప్రిన్సిపాల్ శారద తదితరులు

చార్మినార్: ఇంగ్లిష్ ఫెయిర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది. అకాడమిక్ ఫెయిర్ ముగింపులో భాగంగా ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఇర్ఫాన్ ఖాన్‌తో పాటు తన సతీమణి డాక్టర్ ఆస్ఫా సిద్దిఖా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. చార్మినార్ నారాయణ స్కూల్‌లో జరిగిన ఇంగ్లిష్ ఫెయిర్‌ను తిలకించిన వారు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వర్, ప్రిన్సిపాల్ శారద, భవానీ, కోఆర్డినేటర్లు, వైస్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఘనంగా మజ్లిస్ ఆవిర్భావ దినోత్సవం

గోల్కొండ: మజ్లిస్ పార్టీ పనితీరును అన్ని వర్గాల వారు మెచ్చుకుంటున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం మజ్లిస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్వాన్ నియోజకవర్గాలలోని జరిగిన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని పార్టీ పతాకావిష్కరణ చేశారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్ ఫరాన్, బదర్ ఉద్దీన్, మీర్జా ఎక్బాల్ అహ్మద్, తదితరులన్నారు.



మజ్లిస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

పాతబస్తీలో ఫ్లాగ్ మార్చ్

డబీర్‌పురా: పాతబస్తీలో శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా ఆర్‌ఏఎఫ్ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు మీర్‌చౌక్ ఏసీపీ ఎస్.దామోదర్ రెడ్డి తెలిపారు. గురువారం మీర్‌చౌక్ ఏసీడీ డివిజన్ మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన ఆర్‌ఏఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ దారుషిఫా ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై అజాఖానా జహేరా, జాంబాగ్, దూద్‌ఖానా, కాలికబర్, డబీర్‌పురా కట్టిల గూడ, సీబీఎస్ బస్టాండ్, సాలార్‌జంగ్ మ్యూజియం , చెత్తబజార్ మీదుగా మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ వరకు కొనసాగింది. కమాండెంట్ విజయ్‌కుమార్ వర్మ, డిప్యూటీ కమాండెంట్ నరేశ్‌కుమార్, మీర్‌చౌక్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భవానీనగర్‌లో..

గౌలిపురా: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీ తెలిపారు. రానున్న పండుగల నేపథ్యంలో భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన గురువారం 75 మంది ఆర్‌ఏఎఫ్ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ స్టేషన్ పరిధిలోని భవానీనగర్, నషేమాన్‌నగర్, ఆమన్‌నగర్, తలాబ్‌కట్టా తదితర ప్రాంతాల్లో కొనసాగింది. అడిషనల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి, ఎస్సైలు రాఘవేందర్ రెడ్డి, రాఘవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న మీర్‌చౌక్ ఏసీపీ దామోదర్‌రెడ్డి